క్లుప్తంగా

ప్రైవేటుకు దీటుగా సర్కార్ బడులు



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఇంద్రవెల్లి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నామని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలల్లో దూర ప్రాంతాల విద్యార్థులకు మంజూరైన ఉచిత బస్‌పాస్‌లను మంగళవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం గోపాల్‌సింగ్ తిలవత్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ బాబారావ్, నాయకులు సత్యానంద్, మర్సుకోల తిరుపతి, ఎండీ జునైద్, రాథోడ్ సంజీవ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భీం విగ్రహానికి నివాళి



నివాళులర్పిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కుమురం భీం చౌక్‌లో నూతనంగా ఆవిష్కరించిన భీం విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం విగ్రహానికి పూలమాలలు వేసిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పూర్తి స్థాయిలో సాగు పత్రాలు ఇవ్వకుండా కొందరికే పరిమితం చేసిందని ఆరోపించారు. ఆదివాసీలపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్, షకీల్, ఆసిఫ్, మన్సూర్, రహీమ్, షమీ ఉల్లాఖాన్, అశోక్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



పల్లి(బి)లో మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

తలమడుగు: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవా ఆధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే అన్నారు. మండలంలోని పల్లి(బి), పునగూడ, చేర్లపల్లి, కప్పర్‌దేవి గ్రామాల్లో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షమా దేశ్‌పాండే మాట్లాడుతూ రాజీమార్గంతో లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్ రమేశ్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌ఎం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఆదిత్యనగర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి శ్యామ్‌సుందర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతనికి నార్నూర్ మండలం కాంపూర్ ఎంపీపీఎస్ హెచ్‌ఎం చౌహాన్ శ్రీనివాస్‌నాయక్ అండగా నిలిచారు. శ్యామ్‌సుందర్ చికిత్సకు మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. న్యాయవాది జాదవ్ శ్రావణ్‌నాయక్, కోట్నాక్ బారిక్‌రావు, జాదవ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా రవి



అల్లకొండ రవి

జైనథ్: ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కన్వీనర్ మల్లేశ్ తెలిపారు. మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు దుమాల దేవన్న అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండల కన్వీనర్‌గా అల్లకొండ రవి, జైనథ్ గ్రామ కమిటీ కన్వీనర్‌గా కొడిచర్ల శివ్వన్నతోపాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

సిరికొండ: మండల పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రం జలపతిరావ్, ఉపాధ్యక్షుడిగా బత్తుల రాజు, కార్యదర్శిగా పంద్రం విజయ్ కుమార్, కోశాధికారిగా కాంబ్లే దినేష్ ఎన్నికయ్యారు.

నిదరోతున్న నిఘానేత్రాలు

- నేరడిగొండలో 17 సీసీ కెమెరాల ఏర్పాటు
- నిర్వహణ సరిగా లేక నిరుపయోగం
- పట్టించుకోని పోలీసులు



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



నేరడిగొండ పోలీసుస్టేషన్‌లో పనిచేయని మానిటర్

నేరడిగొండ: అధికారుల నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. వారి నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నేరడిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. 2018లో స్థానికుల విరాళాలతో 17 సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఇవి కొన్నిరోజుల పాటు బాగానే పనిచేశాయి. కాని వీటి నిర్వహణ సరిగా లేక పనిచేయడం లేదు. కొన్నిచోట్ల కెమెరాలు సైతం మాయం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో మేలు

జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నేరడిగొండలో సీసీ కెమెరాల ఆవశ్యకతను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు, గ్రామస్తులు పోలీసుల ఆధ్వర్యంలో కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధాన వ్యాపార సముదాయాల్లో ఏర్పాటు చేస్తే ఎంతో మేలు కలుగుతుందని భావించిన వ్యాపార వర్గాలు విరాళాలు అందజేశారు. కెమెరాల ఏర్పాటు అనంతరం పోలీసు సిబ్బంది పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

చిన్నపాటి చోరీలు

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవలే బైక్‌లు చోరీకి గురయ్యాయి. ఇలా బయటకు రాని పలు సంఘటనలెన్నో ఉన్నాయి. అంతేకాకుండా అనేక అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే అన్నివిధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలి. ప్రధాన కూడళ్లలో జరిగే పలు ఘటనలపై పోలీసులకు పట్టు పెరుగుతుంది. దొంగతనాలు, కొత్త వ్యక్తుల కదలికలను పసిగట్టవచ్చు.

– అల్లం రాకేశ్, యువ నాయకుడు, నేరడిగొండ

చర్యలు తీసుకుంటాం



మండల కేంద్రంలోని సీసీ కెమెరాలను పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల్లో ఇప్పటికే కెమెరాలు ఏర్పాటు చేశాం. నిర్వహణ సరిగా లేకపోవడంతో పనిచేయడం లేదు. గ్రామాభివృద్ధి కమిటీలు సహకరించాలి.

– సాయన్న, ఎస్సై, నేరడిగొండ

పథకాలు అందాలంటే కాంగ్రెస్ రావాలి

- ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న నరేశ్ జాదవ్

నేరడిగొండ: పేదలకు పథకాలు అందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుంటాల, గోవింద్‌పూర్, పీచర గ్రామాల్లో మంగళవారం ఇంటింటా తిరిగి గతంలో ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. నియోజకవర్గ నాయకుడు జాదవ్ వసంత్‌రావు, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగ్‌నాథ్, ఇచ్చోడ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్ ఖాన్, గుడిహత్నూర్ మండల ఉపాధ్యక్షుడు ఆరిఫ్ ఖాన్ పాల్గొన్నారు.

వర్షంలో కొనసాగిన కార్మికుల సమ్మె



తాంసిలో వర్షంలో పంచాయతీ కార్మికులు

తాంసి/ఇంద్రవెల్లి/సిరికొండ: జిల్లాలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె ఆరో రోజూ చేరింది. తాంసి మండలంలో పంచాయతీ కార్మికులు వర్షంలో తడుస్తూ సమ్మె చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమ్మెకు మండల సర్పంచులు మద్దతు తెలిపారు. ఇంద్రవెల్లిలో కార్మికుల సమ్మెకు జెడ్పీటీసీ, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాథోడ్ చారులత మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు నెలకు రూ.26 వేలు వేతనం అందించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సిరికొండలో కార్మికులు వర్షంలో సమ్మె చేశారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్నూర్: రైతులకు మూడు గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, టౌన్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిర్, మహిళ ఉపాధ్యక్షురాలు విద్యారాణి, నాయకులు కనక ప్రభాకర్, షేక్ దాదేఆలీ, మానిక్‌రావు, శివాజీ రాథోడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అలీనవాజ్ జంగ్ బహదూర్ జయంతి



పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్

ఎదులాపురం: తెలంగాణ నీటిపారుదల పితామహుడు అలీ నవాజ్ జంగ్ బహదూర్ 146వ జయంతిని ఆదిలాబాద్ ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్ అండ్ ఎల్బీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ నవాజ్‌జంగ్ నాడు నిర్మించిన నిజాంసాగర్ నేటికీ సజీవంగా ఉందన్నారు. నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన జయంతిని తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ డేగా ప్రకటించడం హర్షనీయమన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మవార్ వేదాంత్, యోగేష్, వికాస్, శ్రీనివాస్, అబ్దుల్ రబ్, విజయ్, రాజు, అల్మాస్ ఖాన్, తోఫిక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని ధన్నూర్(బి) నుంచి నాగాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు రూ.2 కోట్ల 10 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, ఎంపీటీసీ నారాయణరెడ్డి, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాంగ్విపల్లెను అభివృద్ధి చేస్తా

మండలంలోని సాంగ్విపల్లెను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం పోడు పట్టాలను అందజేశారు. మావ నాటే..మావ రాజ్ కళను సీఎం కేసీఆర్ సాకారం చేశారని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, ఎల్క రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరాటఫలితమే పోడు రైతులకు పట్టాలు



రైతులకు పోడు పత్రాలు అందిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పోరాట ఫలితమే రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు అందిస్తోందని జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. మండలంలోని పిప్రి గ్రామ రైతులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోడుసాగులో అర్హులుగా ఉండి అనేకమంది రైతుల పేర్లు తొలగించడం సరికాదన్నారు. పోడు భూములకు సర్వే చేపట్టి అర్హులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కుర్సెంగా సూర్య, రైతులు మడావి సుభాష్, కోడప ఆశోక్, కుడ్మేత మల్కు, దుర్గ శ్యామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



రైతులకు విత్తనాలు, పనిముట్లు అందజేస్తున్న సభ్యులు

బోథ్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జై కిసాన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. నాటు కూరగాయల విత్తనాలను అందించారు. రైతుల కోసం రూ. 80 వేలు విలువ గల యంత్రాలు, పనిముట్లను అందజేశారు. తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల అరుణ్‌కుమార్, సర్పంచ్ రాధిక గంగాధర్, ఉప సర్పంచ్ రవీందర్, సిరి సంపద రైతుల సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కిషన్‌రెడ్డితో నాయకులు

ఆదిలాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశానికి హాజరైన రాష్ట్ర నాయకురాలు, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌లు కిషన్‌రెడ్డిని కలిసి సన్మానించారు.

కేసీఆర్‌ను కలిసిన మనీషా

ఆదిలాబాద్‌టౌన్: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితులను వివరించినట్లు సమాచారం. కాగా బీఆర్‌ఎస్ నాయకులు పవన్ తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కు ఎంపీపీ కృతజ్ఞతలు

బోథ్: సొనాల గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసినందుకు మంత్రి కేటీఆర్‌ను ఎంపీపీ తుల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్నతోపాటు లోక భూమారెడ్డితో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సొనాలకు గురుకుల పాఠశాలలు, కేజీబీవీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిపారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖయ్యూమ్‌ను మహిళా సీనియర్ నాయకురాలు జాదవ్ సులోచన మంగళవారం మండలకేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు లాజర్, రాజేశ్వర్, దేవానందం, సలీం, అహ్మద్, మాజీద్ ఉన్నారు.

బ్యాగుల అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జై భీంనగర్ కాలనీకి చెందిన 20 మంది నిరుపేద విద్యార్థులకు సామాజిక సేవకుడు జైదేవి మెడికల్ నిర్వాహకుడు మదన్ గిత్తే మంగళవారం ఉచితంగా స్కూల్ బ్యాగులు అందజేశారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని అవసరమైన విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు అందించినట్లు తెలిపారు.

రక్తదానం

ఎదులాపురం: బేల మండలం దహెగాం గ్రామానికి చెందిన తాజిమా అనే గర్భిణి ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. ఆమెకు (బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్) రక్తం తక్కువగా ఉంది. రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించడంతో కుటుంబీకులు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామరూపేశ్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి..ఆదిలాబాద్‌కు చెందిన మోసిన్ ద్వారా మంగళవారం రక్తదానం చేయించారు. దీంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

గోరింటాకు వేడుకలు

నేరడిగొండ: ఆషాఢమాసం పురస్కరించుకుని స్థానిక కేజీబీవీలో మంగళవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఎస్‌ఓ అజ్మీరా రజిత, విద్యార్థినులు, ఉపాధ్యాయినులు గోరింటాకు పెట్టుకున్నారు.

నేడు నిరసన కార్యక్రమాలు

బోథ్: మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మండలంలో బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనంతోపాటు నిరసన కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వబోమని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అన్ని రైతు వేదికల వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయాలన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోండి



బస్‌పాస్ ఫారాలు అందజేస్తున్న గంగయ్య

గుడిహత్నూర్: ఆర్టీసీ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ బడుగు గంగయ్య అన్నారు. మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్‌పాసులు పొందడానికి దరఖాస్తు ఫారాలను అందజేసి మంగళవారం అవగాహన కల్పించారు. శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు లభిస్తాయన్నారు. అదేవిధంగా టికెట్లలో రాయితీలు ఎలా పొందాలనే విషయాలను వివరించారు.

ఘనంగా బోనాలు



బోనమెత్తిన మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో ఆషాఢబోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. గ్రామదేవతలకు బోనం సమర్పించి పూజలు చేశారు. ఆషాఢ బోనాల పండుగలో గ్రామ దేవతను పూజించడం, కొత్తకుండలో వండి ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పిస్తుంటారు. చిన్న ముంతలో పానకం పోస్తారు. దీనిపై దివ్వె పెట్టి బోనంపై జ్యోతిని వెలిగించి జాతరను కనుల పండువగా నిర్వహిస్తారు.

ఆదివాసీ విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని, తండ్రిని సన్మానిస్తున్న నాయకులు

బోథ్: మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన ఉట్నూర్ ఐటీడీఏ డైరెక్టర్ మేస్రం భూమన్న కూతరు నిరూపమ ఐఐఐటీలో సీటు సాధించింది. పార్డి(బి) రాయిసెంటర్‌తోపాటు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సిబ్బంది మంగళవారం తండ్రి భూమన్న, కూతురు నిరూపమను సన్మానించారు. సర్పంచ్ జుగ్నక్ మారుతి, సార్మేడి తొడసం లక్ష్మణ్, హెచ్‌ఎంలు భూమన్న, గంగాధర్, ఉప సార్మేడి లాలూరాం, సుంగన్న, హేమన్ రావు, జంగు ఉన్నారు.

మహిళలకు అండగా షీ టీం

ఉట్నూర్‌రూరల్: మహిళలు, విద్యార్థినులకు షీటీం అండగా ఉంటుందని షీటీం సభ్యులు కమల, భాగ్యశ్రీ పేర్కొన్నారు. మండలంలోని శ్యాంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు అవాహన కల్పించారు. ఎవరైన భయభ్రాంతులకు గురిచేస్తే సమాచారం అందించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు, సమస్యలున్నా 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

సిరికొండ: 18 ఏళ్లు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్తెర్ వర్ణ సూచించారు. మండలంలోని పోన్న గ్రామంలో మంగళవారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. యువతి, యువకులు కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు ఫారం-6ను పూరించి బీఎల్‌వోలకు అందించాలన్నారు. ఆర్‌ఐ విలాష్, బీఎల్‌వోలు ఉన్నారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయాలి

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మురళీధర్ రావుల గణపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను బాగు చేయాలి

బోథ్: సొనాల గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, వాటిని బాగు చేయాలని నవయువ మహాజన్ యూత్ అధ్యక్షుడు మంగలిపెల్లి రాజశేఖర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న గ్రామంలో వందల వాహనాలు వెళ్తుంటాయన్నారు. దొంగలను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

గుడిహత్నూర్: ఇచ్చోడ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జీ.ఇ. ప్రభుజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో గల గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ పాసైన విద్యార్థినులు ఈనెల 20 లోగాదరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బానోత్ హరితా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తుదారులకు ఈనెల 21న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీటు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.